క్లుప్తంగా

ఫిజియోథెరపి క్యాంపు



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి భవిత కార్యాలయంలో బుధవారం ఫిజియోథెరపి క్యాంపు నిర్వహించారు. అంగవైకల్యం గల చిన్నారులకు ఫిజియోథెరపిస్ట్ అరుణ్, వైద్య పరీక్షలు చేశారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో భవిత సిబ్బంది వెంకటేశం, శివకుమార్ తదితరులున్నారు.

క్రమం తప్పకుండా వ్యాయామం చేయించాలి



పెద్దకొగప్‌గల్(జుక్కల్): ప్రతి రోజు దివ్యాంగ పిల్లలకు ఇంటి దగ్గర వ్యాయామం చేయించాలని, వారి తల్లిదండ్రులకు ఫిజియోథెరపిస్ట్ విశాలాక్షి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయంలో ఎంఈవో దేవి సింగ్ ఆధ్వర్యంలో ఫిజియోథెరపి క్యాంప్ నిర్వహించి, సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు విఠల్, రాందాస్, రాథోడ్ బలరాం, కంప్యూటర్ ఆపరేటర్ పవిత్ర పాల్గొన్నారు.

జీపీ రికార్డుల పరిశీలన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఆత్మకూర్ జీపీ కార్యాలయంలో బుధవారం మండల పంచాయతీ అధికారి(ఎంపీవో) శ్రీనివాస్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయం ద్వారా జరిపిన ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన రసీదులను తనిఖీ చేశారు. ప్రతి వార్డులో పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. గ్రామ సర్పంచ్ బాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రమేష్ ఉన్నారు.

మొక్కల పెంపకంపై అవగాహన

రామారెడ్డి(ఎల్లారెడ్డి): మండలంలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కల పంపకం, కూలీలను రప్పించడంపై పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో సవిత సమీక్షించారు. అనంతరం ఎంపీడీవో సవిత మాట్లాడుతూ.. నర్సరీల్లో మొక్కల పెంపకంపై శ్రద్ధ వహించాలన్నారు. ఏపీవో ధర్మారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డికి చేరిన క్రిస్మస్ బహుమతులు



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): నియోజకవర్గానికి సంబంధించిన క్రిస్మస్ బహుమతులు బుధవారం ఎల్లారెడ్డికి చేరుకున్నట్లు రెవెన్యూ వర్గాలు తెలిపాయి. క్రిస్మస్ సందర్భంగా క్రిస్టియన్లకు ప్రభుత్వం నుంచి బహుమతులు అందించనున్నారు. వీటిని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

నిత్యాన్నదానానికి స్పందన

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయం వద్ద నిర్వహిస్తున్న నిత్యాన్నదాన కార్యక్రమానికి అపూర్వ స్పందన లభిస్తోంది. అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ నిత్య అన్నదానం కార్యక్రమానికి అనేక మంది భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకుని భోజనం చేస్తున్నారు. అయ్యప్ప దీక్షాపరులు భక్తులకు ఇబ్బందులు కలుగకుండా సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



గాంధారి(ఎల్లారెడ్డి): పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను గుర్తించి బుధవారం బాధితునికి అప్పగించినట్లు ఎస్సై ప్రేమ్‌దీప్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన మెల్లా ఖాసీం తన సెల్‌ఫోన్ పోయిందని గతంలో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ ఆధారంగా ఫోన్‌ను గుర్తించి అప్పగించినట్లు తెలిపారు.

గాయత్రిలో చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. సోమవారం నాటికి 95 వేల 766 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

కబ్జా నుంచి కాపాడాలి

- కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు విద్యార్థి సంఘాల వినతి
- భూకబ్జా చేయడానికి ప్రైవేట్ వ్యక్తులు ప్రయత్నిస్తున్నారని ఆరోపణ



ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆస్తులు, భూములు కబ్జా కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కామారెడ్డి విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల భూములను కబ్జా చేయడానికి ప్రైవేట్ వ్యక్తులు ప్రయత్నిస్తున్నారని వివరించారు.

శిశు మందిర్ యాజమాన్యం 2018, ఫిబ్రవరిలో రెండు ఎకరాలు తప్పుడు లీజు రిజిస్ట్రేషన్ చేయించుకుని భూకబ్జాలకు పాల్పడుతుందని ఆరోపించారు. అలాగే అరోరా, కర్షక్ బీఈడీ కళాశాల భవనాలను స్వాధీనం చేసుకుని ప్రభుత్వ విద్యా సంస్థలు నెలకొల్పాలని కోరారు. ఉన్న భూముల చుట్టూ ప్రహరీ నిర్మించి కళాశాల ఆస్తులను రక్షించాలని కోరారు. కార్యక్రమంలో బీడీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎల్‌ఎన్.ఆజాద్, ఎస్ఎఫ్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఐరేని సందీప్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ముదాం అరుణ్, బీవీఎం రాష్ట్ర కార్యదర్శి జీవీఎం విఠల్, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు కుంబాల లక్ష్మణ్ యాదవ్, బీసీవీఎస్ జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు, బీడీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు నరేందర్ తదితరులున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



పిట్లంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

పిట్లం(జుక్కల్): వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఏఎస్సై లింబాద్రి పేర్కొన్నారు. ఆయన బుధవారం మండల కేంద్రంలో పిట్లం – బాన్సువాడ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించి పలువురికి జరిమానాలు వేశారు.

ఏఎస్సై మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు వాహన ధ్రువపత్రాలు ఉంచుకోవడంతో పాటు హెల్మెట్ ధరించాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను వాహనాలలో తరలించొద్దన్నారు. పోలీస్ సిబ్బంది బుచ్చయ్య చారి, బాలాజీ రావ్, సాయగౌడ్, మారుతీ తదితరులు పాల్గొన్నారు.

ఓనర్‌షిప్ సర్టిఫికెట్ల జారీలో తీవ్ర నిర్లక్ష్యం



ఆందోళన చేస్తున్న కొత్తాబాది గ్రామస్తులు

బాన్సువాడ రూరల్: మండలంలోని కొత్తాబాది జీపీ కార్యాలయం ఎదుట బుధవారం పలువురు గ్రామస్తులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యాభై ఏళ్లుగా సొంతిళ్లలో జీవిస్తున్నా తమకు పంచాయతీ కార్యదర్శి ఓనర్‌షిప్ సర్టిఫికేట్ ఇవ్వడం లేదని ఆరోపించారు. పంచాయతీ కార్యదర్శి, స్థానిక ప్రజాప్రతినిధులతో కుమ్మక్కై సర్టిఫికేట్ల జారీలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాల్సిందిగా డిమాండ్ చేశారు. పంచాయతీ కార్యదర్శి నవీన్ మాట్లాడుతూ.. సర్పంచ్, వార్డు సభ్యులు సూచిస్తే నిబంధనల మేరకు ఓనర్‌షిప్ సర్టిఫికెట్లు జారీ చేస్తానన్నారు.

యాజమాన్య ఏకపక్ష వైఖరిపై నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఎల్‌ఐసీ సిబ్బంది

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఎల్‌ఐసీ శాఖ ఎదుట బుధవారం మధ్యాహ్నం సిబ్బంది నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎల్‌ఐసీ యాజమాన్య ఏకపక్ష వైఖరిని నిరసిస్తూ నినాదాలు చేశారు. ఎల్‌ఐసీలో పని చేస్తున్న అన్ని తరగతుల ఉద్యోగ నియామకాలు చేపట్టాలని, కొత్త పెన్షన్ స్కీం కింద యాజమాన్య వాటాను పది నుంచి 14 శాతానికి పెంచాలని, 2022, ఆగస్టు నుంచి జరగాల్సిన వేతన సవరణ కోసం వెంటనే చర్చలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు పి.సంపత్‌కుమార్, కార్యదర్శి కాసాల అనిల్‌కుమార్, ప్రతినిధులు రమేష్‌గౌడ్, దామోదర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో శ్రమదాన్ దివాస్



క్యాసంపల్లిలో ఫర్నిచర్‌ను బాగు చేస్తున్న సభ్యులు

కామారెడ్డి రూరల్: క్యాసంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం పెడిలైట్ కంపెనీ ఆధ్వర్యంలో కామారెడ్డి ఫెవికాల్ ఛాంపియన్ క్లబ్ కాంట్రాక్టర్స్ సహకారంతో శ్రమదాన్ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాలలోని పాత టేబుల్స్, కుర్చీలు, డోర్స్ దాదాపు రూ.20 వేల విలువైన ఫర్నిచర్‌ను బాగు చేశారు. ఈ కార్యక్రమానికి మార్కెట్ డెవలప్మెంట్ ఇంచార్జ్ మహేందర్, ఫెవికాల్ చాంపియన్ క్లబ్ సభ్యులు బెజ్జంకి రవికుమార్, మహావీర్, తదితరులు హాజరయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గీత, తెలంగాణ గణిత ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలతో పని చేయించొద్దు



గంటి తండాలో సర్వే నిర్వహిస్తున్న సీఆర్పీ సంజీవ్



నల్లమడుగులో పిల్లలను గుర్తించిన సీఆర్పీలు

మాచారెడ్డి: బడీడు పిల్లలతో పని చేయించకుండా బడిలో చేర్పించాలని మాచారెడ్డి సీఆర్పీ సంజీవ్ సూచించారు. బుధవారం గంటి తండాలో సర్వే నిర్వహించారు. 9వ తరగతిలో బడి మానేసిన పావని అనే బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి బడిలో చేర్పించారు. గంటి తండా ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ప్రవీణ్ ఉన్నారు.

లింగంపేట పరిధిలో పిల్లల గుర్తింపు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని నల్లమడుగు, పర్మళ్ల, గట్టుమైసమ్మతండా గ్రామాల్లో బుధవారం సీఆర్పీలు బడి మధ్యలో మానేసిన పిల్లలను గుర్తించి బడిలో చేర్పించారు. బడి మధ్యలో చిన్నారులను మాన్పించకూడదని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఇటుక బట్టీల దగ్గర వలస వచ్చిన పిల్లల కోసం ప్రత్యేక పాఠశాలలు, వర్క్ సైట్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సీఆర్పీలు సంగాగౌడ్, సంజీవ్, విజయ్‌కుమార్, రాజు, సత్యనారాయణ, గంగాధర్ పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



కాచాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న నేతలు

భిక్కనూరు: కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు తెలియజేయడానికి నిర్వహిస్తున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్ర బుధవారం కాచాపూర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా బీజేపీ నేతలు కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీజేపీ గ్రామ అధ్యక్షుడు గొల్లపల్లి అనిల్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం, నిరుపేదలకు అవసరమైన ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు.

తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలి



బాన్సువాడ: బ్యాంకుల్లో మహిళలు తీసుకున్న రుణాలు ప్రతి నెలా క్రమం తప్పకుండా చెల్లించేలా వీవోలు చర్యలు తీసుకోవాలని మెప్మా టౌన్ మిషన్ కో–ఆర్డినేటర్ రవిశంకర్ అన్నారు. బుధవారం బాన్సువాడ మున్సిపల్ కార్యాలయంలో ఆయన వీవోలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆర్థిక సంవత్సరం చివరి నెల కావడంతో స్త్రీనిధి, గ్రామ సంఘానికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రమేష్ తదితరులున్నారు.

నారు కొనలను తుంచి నాటు వేయాలి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): వరి నారు కొనలను తుంచి నాటు వేయాలని ఏఈవో రాజాగౌడ్ అన్నారు. బుధవారం రత్నాపూర్, తిమ్మారెడ్డితండాలలో రైతులకు వరి నాటు విధానం గురించి కూలీలకు వివరించారు. దీని వల్ల కాండం తొలుచు పురుగులు వ్యాప్తి చెందకుండా ఉంటాయన్నారు.

సుస్థిర వ్యవసాయంపై అవగాహన



భిక్కనూరు: గుర్జకుంటలో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు సుస్థిర వ్యవసాయంపై బుధవారం అవగాహన కల్పించారు. వర్మి కంపోస్టు తయారీ, షెడ్ మేనేజ్‌మెంట్‌పై రైతులకు వివరించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌లు సిద్ధరాములు, భూపతి, పంచాయతీ కార్యదర్శి రేణుక ఫోరం సభ్యులు సంతోష్‌రెడ్డి, గంగారెడ్డి, రమేష్, మల్లారెడ్డి, దుర్గారెడ్డిలు పాల్గొన్నారు.

బగళాముఖి అమ్మవారి జన్మదిన వేడుకలు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి పట్టణంలో బగళాముఖి అమ్మవారి జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అమ్మవారి పీఠంలో జ్యోతిష్య పండితులు క్రాంతి పటేల్ అమ్మవారికి ప్రత్యేకంగా హరిద్రా అభిషేకం చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. పీఠం సభ్యులు రేవంతప్ప, సతీష్, ఓర విఠల్, వెంకటేశం తదితరులున్నారు.

అయ్యప్ప స్వాములకు అల్పాహారం

- ముస్లిం యువకుడి భిక్ష



రాజంపేట: కుల మతం తేడా లేకుండా దేవుడు అందరికి సమానమనే భావనతో ప్రతి సంవత్సరం అయ్యప్ప దీక్ష తీసుకున్న అయ్యప్ప స్వాములకు భిక్షతో పాటు అల్పాహారాన్ని అందిస్తూ రాజంపేట గ్రామానికి ముంతాజ్ అలీ శభాష్ అనిపించకుంటున్నారు. రాజంపేట మండలం కేంద్రంలోని 26 మంది అయ్యప్ప స్వాములు దీక్ష పూనారు. వారు మండల కేంద్రంలోని వేంకటేశ్వర ఆలయంలో సన్నిదానం ఏర్పాటు చేసుకొని నిత్యం పూజలు నిర్వహిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన ముస్లిం యువకుడు ముంతాజ్ అలీ అయ్యప్ప దీక్ష పూనిన అయ్యప్ప స్వాములకు బుధవారం భిక్ష, అల్పాహారం అందించారు.

పిట్లంలో..

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో బుధవారం మాజీ సర్పంచ్ జొన్న మోహన్‌రెడ్డి అయ్యప్ప స్వాములు, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.అంతకు ముందు కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

చలి నుంచి నారును రక్షించుకోవాలి



నారును పరిశీలిస్తున్న ఏవో విజయ్ శేఖర్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): రైతులు చలి తీవ్రత నుంచి నారుమడులను రక్షించుకోవాలని నాగిరెడ్డిపేట ఏవో విజయ్‌శేఖర్ సూచించారు. జప్తిజాన్కంపల్లి శివారులో వరి నారుమడులను బుధవారం రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చలితీవ్రత నుంచి నారుమడులను కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. నారు ఆరోగ్యంగా పెరగడానికి కిలో యూరియాకు 2 గ్రాముల కార్బండజిమ్, మ్యాంకోజెబ్ మిశ్రమాన్ని కలిపి పైపాటుగా వేసుకోవాలని చెప్పారు. దీంతోపాటు రాత్రివేళ నిండుగా ఉంచిన నీటిని తెల్లవారుజామున తీసివేసి కొత్తనీరు పెట్టాలన్నారు. నారు పీకే 7 రోజుల ముందు రెండు గుంటల నారుమడికి 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను చల్లి నారుమడిలోనే ఇంకేలా చేయాలన్నారు. సర్పంచ్ దేశబోయిన సాయిలు ఉన్నారు.

విద్యార్థులకు సక్రమంగా బోధించాలి



మాట్లాడుతున్న జీఈసీవో ఉమారాణి



పరిశీలిస్తున్న మండల నోడల్ అధికారి షౌకత్ అలీ

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఉపాధ్యాయులు విద్యార్థులకు సక్రమంగా బోధించాలని జీఈసీవో(జెండర్ ఈక్విటీ కో–ఆర్డినేటర్) ఉమారాణి అన్నారు. బుధవారం ఎల్లారెడ్డిలోని కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలను పరిశీలించారు.

విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని, సక్రమంగా బోధన చేయాలని సిబ్బందికి ఆమె సూచించారు. స్పెషల్ ఆఫీసర్ సుశీల, ఉపాధ్యాయినీలు తదితరులు ఉన్నారు.

అర్థమయ్యేలా బోధించాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని మండల నోడల్ అధికారి షౌకత్ అలీ సూచించారు. బుధవారం గట్టుమైసమ్మ తండా, సురాయిపల్లితండా, సురాయిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు పరిశీలించారు.. విద్యార్థుల నైపుణ్యాలను గమనించారు. ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం నేర్పాలన్నారు. ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ, దామోదర్, మధు, సీఆర్పీ గంగాధర్ తదితరులున్నారు.

విద్యార్థులను ప్రతి రోజు పాఠశాలకు పంపించాలి



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్

పెద్దకొడప్‌గల్(జుక్కల్): విద్యార్థులను ప్రతి రోజు పాఠశాలకు పంపించి హాజరు శాతం పెంచాలని ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్ కుమార్, తల్లిదండ్రులకు సూచించారు. బుధవారం కాటేపల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్ కుమార్, విద్యార్థుల హాజరు శాతం, ప్రగతిపై చర్చించి పాఠశాలలో చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ సాయిలు, సభ్యులు పాల్గొన్నారు.

ఉత్తర ద్వారం నుంచి అమ్మవారిని దర్శించుకోవచ్చు



కామారెడ్డి రూరల్: పట్టణ పరిధిలోని ఇల్చిపూర్ గ్రామ శివారు సరస్వతి ఆలయంలో ఈ నెల 23న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఆలయంలోకి ఉత్తర ద్వారం నుంచి ప్రవేశించి అమ్మవారిని దర్శించుకోవచ్చని ఆలయ అర్చకులు దత్తాత్రిశర్మ, ఆలయ నిర్మాణ దాత పార్శి విఠల్‌పటేల్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయాన్ని సందర్శించుకుని అమ్మవారి ఆశీస్సులు పొంది తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు.

లింగాపూర్‌లో..

కామారెడ్డి మున్సిపల్ పరిధి లింగాపూర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 23న శనివారం వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఉత్తర ద్వారం నుంచి ప్రవేశించి స్వామివారిని దర్శించుకోవచ్చని ఆలయ అర్చకుడు రవికాంత్, కొమిరెడ్డి పెద్ద నారాయణలు తెలిపారు. ఉదయం 5:30 గంటల నుంచి ఉత్తర ద్వారం నుంచి దర్శనం చేసుకోవచ్చన్నారు. సాయంత్రం 6 గంటలకు పల్లకీ సేవ ఉంటుందన్నారు.

ప్రతి నర్సరీలో 10 వేల మొక్కలు పెంచండి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): ప్రతి జీపీ నర్సరీలో 10 వేల మొక్కలను పెంచాలని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. కాలోజీవాడి గ్రామ శివారులో గల నర్సరీని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలు ఏపుగా పెరిగేలా చూడాలన్నారు. వచ్చే సంవత్సరం మే నెల వరకు మొక్కలు ఏపుగా పెరగాలన్నారు. గ్రామంలో ఎక్కడ ఖాళీ స్థలం ఉంటే అక్కడ మొక్కలు నాటాలన్నారు. గ్రామంలో ఉన్న మంచి నీళ్ల ట్యాంకులను నిత్యం శుభ్రంగా ఉంచాలన్నారు.

ఫిర్యాదు చేస్తే దాడి చేస్తారా?

మాచారెడ్డి: పాల్వంచ మండలం మంతన్ దేవునిపల్లిలో ఎంపీపీ నర్సింగరావు అక్రమ మైనింగ్‌పై ఫిర్యాదు చేస్తే దాడి చేస్తారా అంటూ పాల్వంచ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రమేష్ గౌడ్ ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. దేవునిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త మంత రాజు ఇంటిపై మంగళవారం రాత్రి నర్సింగరావు అనుచరులు దాడి చేసి బైక్, బోరు మోటారును ధ్వంసం చేసినట్లు రమేష్ గౌడ్ తెలిపారు. ఈ నర్సింగరావు ఆగడాలపై జిల్లా ఎస్పీ, కలెక్టర్, మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

హెచ్ఐవీపై అవగాహన



సజ్జన్‌పల్లి జీపీలో అవగాహన కల్పిస్తున్న అధికారి

లింగంపేట(ఎల్లారెడ్డి): సజ్జన్‌పల్లి గ్రామ పంచాయతీలో బుధవారం గ్రామస్తులకు హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై సేవా సంగం ప్రాజెక్టు మేనేజర్ కరుణ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎయిడ్స్ అంటువ్యాధి కాదన్నారు. అక్రమ శారీరక సంబంధాల ద్వారా ఒకరి నుంచి ఒకరికి వ్యాపిస్తుందన్నారు. ఈ వ్యాధికి నివారణ ఒక్కటే మార్గమన్నారు. అనంతరం పలువురి రక్త నమూనాలు సేకరించారు. సర్పంచ్ పుట్టి పోచయ్య, మీన, హనుమంతు, మంజుల తదితరులు పాల్గొన్నారు.